ముంపు పంటలపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-చాగల్లు

ముంపునకు గురైన పంటల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.గోపాలకృష్ణ తెలిపారు. మండలంలో 870 ఎకరాల పంట ముంపు నుంచి బయట పడిందని, ఇంకా 600 ఎకరాల్లో పంట ముంపులో ఉందని ఆయన తెలిపారు. పంట ఊడ్చిన వెంటనే, పిలక దశలో ముంపునకు గురైతే నీటిని పూర్తిగా బయటకు తీసివేసి తరువాత ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అదనంగా వేసుకోవాలన్నారు. ఆ విధంగా బూస్టర్ డోస్ వేసుకోవడం వల్ల మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కోలుకుంటుందని తెలిపారు. మొక్క కోలుకున్న తరువాత కుళ్లు తెగుళ్లు రాకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

శాంతించిన గోదావరి

- 14 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల
- అమలులో రెండో ప్రమాద హెచ్చరిక

ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి నది వరద శాంతించింది. గడిచిన 24 గంటలుగా క్రమ క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు రాష్ట్రంలోనూ వర్షాలు తోడవటంతో కొన్ని రోజులుగా వరద ఉధృతి క్రమ క్రమంగా పెరిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అనేక లంక గ్రామాల్లో ప్రజలు బిక్కు బిక్కు మంటూ జీవనం గడిపారు. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరద ఉధృతి తగ్గింది. భద్రాచలం వద్ద బుధవారం సాయంత్రం 6.00 గంటలకు 45.20 అడుగుల నీటిమట్టం నమోదైంది. 24 గంటల క్రింత అక్కడ 50.50 అడుగుల నీటిమట్టం నమోదైన విషయం విదితమే. సుమారు 5.30 అడుగుల మేర నీటిమట్టం తగ్గింది. క్రమ క్రమగా తగ్గుముఖం పట్టడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లోని పరీవాహక ప్రాంత ప్రజలు కొంత ఊరట లభించింది. బుధవారం సాయంత్రం 6 గంటలకు సర్ ఆర్ధర్ కాటన్ బ్యారేజీ వద్ద 14.70 అడుగుల నీటిమట్టం నమోదయ్యింది. 24 గంటల క్రితం అక్కడ 14.80 అడుగుల నీటిమట్టం నమోదైన విషయం విదితమే. 0.10 అడుగుల నీటిమట్టం తగ్గింది. అక్కడి 175 గేట్ల ద్వారా 14.13 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రానికి విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాల్వలకు 3900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రాజమహేంద్రవరంలోని పాత బ్రిడ్జి వద్ద 15.15 మీటర్లు నీటి మట్టం ఉంది. వారం రోజులుగా వరద ప్రవాహం పెరుగుతూ కొనసాగింది. నది వరదకు స్థానికంగా కురుస్తున్న వర్షాలు తోడవటంతో ప్రవాహ ఉధృతి మరింత పెరిగింది. ఎగువ రాష్ట్రాల్లో వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమై మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. కాటన్ బ్యారేజీ వద్ద 11.75 అడుగుల ఎత్తున నీటిమట్టం చేరితే అధికారుల గణాంకాల ప్రకారం కొనసీమ జిల్లాల్లో 7 గ్రామాలు, 13.75 అడుగులకు చేరితే 13 గ్రామాలు ముంపునకు గురవుతాయని అంచనా. క్షేత్రస్థాయిలో పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. మొదటి ప్రమాద హెచ్చరిక ప్రకటించేప్పటికే పలు కాజ్‌వేలు ముంపునకు గురవటంతో లంక గ్రామాల రాకపోకలకూ ఇబ్బందులు తలెత్తాయి. రెండోప్రమాద హెచ్చరిక జారీ చేసేప్పటికి సుమారు 30 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రజలు, అధికారులు పడవలపై రాకపోకలు చేశారు. మరో వైపు బలహీన ఏటిగట్లు కంటిమీద కునుకులేకుండా చేశాయి. రెండేళ్ల క్రితం కోనసీమలో గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పర్యటించారు. అనేక హామీలు గుప్పించారు. గడిచిన ఏడాదిగా హామీలు ఆచరణలో అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం తగ్గుముఖం పట్టడంతో కొంత ఊరట లభించింది.

ఎర్ర కాలువకు తగ్గిన వరద

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలానికి ఎర్ర కాలువ వరద ముప్పు తప్పిందని ఇరిగేషన్ ఎఇ ఎన్.బాలమురళీకష్ణ తెలిపారు. వారం రోజులుగా మండలంలోని కాల్దారి, పసలపూడి, సూర్యారావు పాలెం గ్రామాల సరిహద్దు వద్ద బలహీనమైన ఏటి గట్ల ద్వారా సమీప చేలను ముంచెత్తిన వరద తగ్గుముఖం పట్టిందని తెలిపారు. ఎగువ నుండి ఇన్‌ఫ్లో 1700 క్యూసెక్కులు మాత్రమే వస్తున్న కారణంగా బుధవారం సాయంత్రానికి ఒక అడుగు తగ్గి, శుక్రవారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక ఎత్తివేసే అవకాశం ఉంటుందన్నారు. వరద నీరు తగ్గిన అనంతరం, రానున్న వారం రోజుల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు ఏటిగట్లకు ఇసుక బస్తాలు, తడిక ఏర్పాటుతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్

ప్రజాశక్తి-చాగల్లు

ఇటీవల కురిసిన వర్షం కారణంగా ఎటువంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బుధవారం ఉదయం నీటి నిల్వలు ఉండే ప్రదేశాలలో ఆయిల్ బాల్స్‌ను గ్రామ సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి విడుదల చేశారు. డయేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా ప్రతిరోజు వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేసిన మంచినీరు మాత్రమే ప్రజలకు సరఫరా చేస్తామన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా రాత్రిళ్లు ఫాగింగ్ చేయిస్తామన్నారు.

కాటన్‌కు పలువురి ఘన నివాళి

కాటన్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ వర్థంతి సందర్భంగా ధవలేశ్వరం ఇరిగేషన్ కార్యాలయాల వద్ద ఉన్న కాటన్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిసిసిబి మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలు ఈరోజు ఇంత సస్యశ్యామలంగా ఉన్నాయంటే కాటన్ మహాశయుడే కారణమన్నారు. ఒకప్పుడు కరువుతో కటకటలాడుతున్న ఈ జిల్లాలు ఈరోజు అన్నపూర్ణగా నిలిచిందంటే అది కేవలం కాటన్ మహాశయుని వల్లేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మద్దాల తిరుపతిరావు, జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, బోడపాటి కుమార్, పందెళ్ల భాను, బోడేటి శివాజీ, శ్రీరంగం బాలరాజు, వీర్ల సాయి, చొల్లంగి సత్యగిరి, గూటం రాజు, నంబూరి రవి, ముత్యాల జాన్, కురుమళ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి



మానవస సంస్థలో సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-గోపాలపురం

ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని మానవత సంస్థ రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ కోరారు. బుధవారం గోపాలపురంలో మానవత సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా మానవత దాతలు గౌరవ డైరెక్టర్ కూసం లక్ష్మీ రాజేశ్వరిని మానవత సంస్థ తరుపున శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మానవత డైరీ అందజేశారు. ఈ మేరకు బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ ఎపి రాష్ట్ర వ్యాప్తంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు 117 శాఖలు ఉన్నాయని తెలిపారు. 10 నూతన శాఖలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 70,000 మంది సభ్యులు ఉన్నట్టు తెలిపారు. పార్థివ దేహాలను భద్రపరిచే 625 ఫ్రీజర్ బాక్కులు, మృతదేహాలను కైలాస భూములకు తరలించడానికి 70 శాంతి రథాలు, అత్యవసర వైద్య సేవలు అందించడానికి 10 అంబులెన్సులు, 15 తాగునీటి వాటర్ ట్యాంకులు, చదువుకునే పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం, ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడం, అత్యవసర ప్రాణాపాస్థితిలో ఉన్నవారికి రక్తం అందించడం, అనేక సేవలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సేవలు మరింత విస్తత స్థాయిలో పెంచేందుకు దాతలు ముందుకు రావాలని తమ వంతుగా సభ్యత్వం తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల మానవత మాజీ అధ్యక్షుడు ముప్పన కప వీర ప్రసాద్ రెడ్డి మానవత సభ్యత్వాలు అందజేశారు. ఈలి శరత్ బాబు మానవత సభ్యత్వం స్వీకరించి సంస్థకు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

పొలాల్లో తొలగని కొవ్వాడ నీరు

చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

ప్రజాశక్తి-తాళ్లపూడి

వర్షాలు కొవ్వాడ వరద నీటి కారణంగా నీట మునిగిన పంటలు ఇంకా నీటిలోనే నానుతున్నాయి. అన్నదేవరపేట, నల్లిమిల్లిపాడు, తిరుగుడుమెట్ట, పోచవరం, గజ్జరం, పెద్దేవం తదితర గ్రామాల పరిధిలో వేసిన వరి పంటతో పాటు చెరకు తదితర పంటలు ఇంకా నీటిలో ఉండి చెరువులను తలపిస్తున్నాయి. వర్షాలు తగ్గినప్పటికీ ఒక్క నీటి చుక్క కూడా బయటకు వెళ్లకపోవడంతో రైతులు లబోదిబోమంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం మండలంలో సుమారు 1700 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లుగా గుర్తించి అధికారులకు నివేదిక పంపారని వ్యవసాయ శాఖ అధికారి రుచిత తెలిపారు.

సత్యదేవ నర్సరీని దర్శించిన రైతాంగం

ప్రజాశక్తి-కడియం

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన పలువురు రైతులు బుధవారం శ్రీ సత్యదేవా నర్సరీలో మొక్కల పెంపకంలో జీవామతం, బీజామతం, ఘన జీవామతం వినియోగాన్ని తెలుసు కున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అటల్ బజల్ యోజన పథకంలో భాగంగా క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అదనపు డిపిఒ షేక్ మహబూబ్ ఆలీ, డిడిహెచ్ శ్రీనివాసులు, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన ఉద్యాన, నీటి పారుదల, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు. సేంద్రియ వ్యవసాయ విధానాలు, ప్రకతి వ్యవసాయం ద్వారా నర్సరీల సాగుని కర్ణాటక, మహారాష్ట్ర రైతులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ అధినేత పుల్లా చంటియ్య, పుల్లా పెద సత్యనారాయణ, మెర్ల కృష్ణమూర్తి, చెక్కపల్లి పుల్లయ్య, ప్రకతి వ్యవసాయ సిబ్బంది వెంకటరమణ, ఐసిఆర్పి దుర్గా ప్రకాష్ పాల్గొన్నారు.

వెంకన్న హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని అన్నవరప్పాడులో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో తాడిపత్రు గ్రూపు దేవాలయంలో ఇఒ ఎంవి.రామయ్య పర్యవేక్షణలో హుండీల లెక్కింపు చేపట్టారు. 35 రోజులకు రూ.2,63,199 ఆదాయం వచ్చినట్టు రామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఒ ఎం.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల బేటీ బచావో, బేటీ పడావో

జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో బుధవారం బేటీ బచావో, బేటీ పఢావో, బాల్యవివాహాలు నియంత్రణ, తల్లి బిడ్డల సంరక్షణ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం రూరల్ కలెక్టర్ పి.ప్రశాంతి తన ఛాంబర్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షించారు. ఆడపిల్ల రక్షణ, ఆడపిల్లలను చదివించడం, లింగ పక్షపాతానికి వ్యతిరేకంగా ప్రజలకి అవగాహన కల్పించడం, బాలికల సంక్షేమ సేవల సామర్థ్యాన్ని మెరుగు పరిచే విధంగా పథకం లక్ష్యాన్ని ప్రజలకు తీసుకువెళ్లాలన్నారు. జిల్లాలో ప్రజలందరికీ అవగాహన కల్పించే విధంగా బేటీ బచావో, బేటీ పఢావో, బాల్యవివాహాలు నియంత్రణ, తల్లీబిడ్డల సంరక్షణ అంశాలపై ప్రతి గ్రామంలో వర్క్ షాప్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో బేటీ బచావో బేటీ బడావో, బాల్య వివాహాలు నియంత్రణపై పాఠశాలల్లో, కమ్యూనిటీ సెంటర్స్ వంటి జన సమూహం గల ప్రాంతాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు జరిగే సమాచారం క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి తెలుసుకునే అవకాశం ఉందని, సామాజిక బాధ్యతతో అటువంటి వాటిని బహిర్గతం చెసేలా ప్రతీ ఒక్కరికీ అవగాహనా కల్పించాలన్నారు. గృహ హింస కేసుల్లో వెంటనే ఎఫ్ఐఆర్ ఫైల్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సెమినార్స్, వర్క్‌షాప్స్, ఎగ్జిబిషన్స్, ర్యాలీలు, వక్తలు ప్రసంగాలు, ఇతర శాఖల సమన్వయంతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో 1,556 అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహిస్తున్న నెలసరి పనితీరుపై సమీక్షలు పక్కగా నిర్వహించి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయ కుమారి, సిడిపిఒలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గోపాలపురంలో..

ఉండ్రాజవరం మండలంలోని మోర్త గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్వైజర్ వి.సరోజిని బాలల హక్కులను, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణాపై చట్టాల గురించి అవగాహన కల్పించారు. కిషోర బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. పరిసరాల పరిశుభ్రత, హ్యాండ్ వాష్ ప్రాధాన్యత వివరించారు. కాచి చల్లార్చిన నీరే తాగాలని, బాల్య వివాహాలను అరికట్టాలని, పిల్లలకు, పెద్దలకు సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. బాలికలకు జీవించే హక్కు, చదువుకునే హక్కు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ రోజా, ఎఎన్ఎం వై.సరోజిని, ఆశా కార్యకర్తలు చిన్నమ్మ, నాగమణి, కౌసల్య, రమణ, మహాలక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు.

చాగల్లు ఇందిరమ్మ కాలనీలో అంగన్వాడీ కేంద్రంలో స్టాప్ డయేరియా కార్యక్రమంలో పిల్లలకు డోర్ టు డో సర్వే చేశారు. ఒఆర్ఎస్, జింక్ టాబ్లెట్ లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్లలో ఒఆర్ఎస్ కార్నర్‌లను ఏర్పాటు చేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ పి.పద్మావతి బాలల హక్కులను, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణాపై చట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం దుర్గ, ఆశా కార్యకర్తలు రజినీ సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త ఎం.అనంత లక్ష్మి పాల్గొన్నారు.

గోపాలపురం బాల్యవివాహాలను అక్రమ రవాణాలను అరికట్టి ఆడపిల్లలను రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిడిపిఒ వైబిటి సుందరి అన్నారు. బుధవారం స్థానిక గోపాలపురం హైస్కూల్లో భేటీ పడావో భేటీ బచావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ చిన్న వయసులోనే బాలివివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. పిల్లల అక్రమ రవాణా అరికట్టాలని, అందుకు అవసరమైన హెల్ప్ లైన్ నెంబర్లు, మొబైల్ ఫోన్ యాప్‌లో ఉంచాలని సూచించారు. ఆడపిల్లలను రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.సోమశేఖర్, సిబ్బంది సరస్వతి, దివ్య, శ్వేత, ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ జెవి.రమణ పాల్గొన్నారు.

గోకవరం మహిళలు, యువతుల అక్రమ రవాణాను అరికట్టడం అందరి బాధ్యత అని కోరుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్ రంజని అన్నారు. బుధవారం మండలంలోని రంప ఎర్రంపాలెం జెడ్‌పి పాఠశాలలో మహిళలు, యువతుల అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టి.బుజ్జమ్మ, కె.కృష్ణవేణి, కె.మైథిలి, జి.అమ్మాణి, సచివాలయం సిబ్బంది వాసవి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కార్టూ'నిజం'



నర్సాపురం ఎంపిడిఒ మృతికి సంతాపం

చాగల్లులో వెంకటరమణరావుకు నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-చాగల్లు, పెరవలి, ఉండ్రాజవరం

నరసాపురం ఎంపిడిఒ వెంకటరమణరావుకు పలువురు ఘనంగా నివాళి అర్పించారు. చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎన్.బుజ్జి మాట్లాడారు. వెంకట రమణారావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మరణానికి కారకులైన వారిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి నర్సాపురం ఎంపిడిఒ వెంకటరమణారావు మృతికి సంతాపంగా బుధవారం మండల కార్యాలయంలో ఎంపిడిఒ కె.ఉమామహేశ్వరి అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ఆయనకు ఘన నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో మానసిక ఒత్తిడికి గురై బలవన్మరణం పొందిన నరసాపురం వెంకటరమణారావు మృతి దురదష్టకరమన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మానసిక ధైర్యం కోల్పోకుండా విధి నిర్వహణలో మనోధైర్యంతో పనిచేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ కుటుంబం ఉంటుందని, కుటుంబ పెద్దగా చాలా బాధ్యతలు ఉంటాయని చెప్పారు. కనుక కుటుంబాన్ని విధి నిర్వహణను సమపాళ్లతో చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సింగంశెట్టి రమేష్, అరిగెల వేణుగోపాలరావు, కోన వెంకటవేణు, సాయి శ్రీనివాస్, సాయి ప్రభు, తాయారు, నివేదిత ఇంజినీరింగ్ సిబ్బంది అడపా శ్రీనివాస్, మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె.నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో అనేక ఆటుపోట్లు ఎదురవుతాయని, అన్నిటినీ ధైర్యంగా తట్టుకుని నిలబడి విధులు నిర్వహించాలన్నారు. ఇంటి పెద్ద, ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు తీవ్ర మనో వేదన మిగులుతుందన్నారు. అకాల మత్యువాత పడిన రమణారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఎఇ భగవన్నారాయణ, ఉపాధి హామీ ఎపిఒ, అసిస్టెంట్లు పాల్గొన్నారు.



స్కూల్ కిట్లు అందిస్తున్న నాయకులు

విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-గోకవరం

కామరాజుపేట పంచాయతీ పరిధిలో సూదికొండ ఎంపిపి పాఠశాలలో బుధవారం హెచ్‌ఎం వివిఎస్‌డి.ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ అడపా వెంకటరావు, రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు అడపా భరత్ కుమార్, ఉప సర్పంచ్ బదిరెడ్డి మనోజ్, ఎస్ఎంసి చైర్మన్ బోడ వాసంతి పాల్గొన్నారు. పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం యూనిఫామ్, బూట్లు, బుక్స్‌తో కూడుకున్న కిట్లను పంపిణీ చేస్తోందన్నారు. వీటిని ఉపయోగించుకుని విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత చదువులు చదవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బెల్లంకొండ రాంబాబు పాల్గొన్నారు. ఠాకూర్‌పాలెం ఎంపిపి పాఠశాలలో హెచ్‌ఎం నారాయణ రావు ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఆది, నాగేశ్వరరావు, భాస్కర రావు, శ్రీను, దుర్గాబాబు, రామకష్ణ, సత్తిబాబు పాల్గొన్నారు. తంటికొండ పాఠశాలలో హెచ్‌ఎం ఎం.అప్పారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా టిడిపి నాయకులు మాజీ దేవస్థానం చైర్మన్ బదిరెడ్డి అచ్చన్న దొర, బదిరెడ్డి బాబీ, టిడిపి నాయకులు వెంకటపతి, బదిరెడ్డి రవి, సిరి, రాజు, శ్రీను పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో..

జాషువాకు ఘన నివాళి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం, తాళ్లపూడి

స్థానిక దేవీ చౌక్‌లోని రత్నం ప్రింటర్స్ కార్యాలయంలో గుర్రం జాషువాకు ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి ఆధ్వర్యంలో ఘనంగా నివాళు ళర్పించారు. సమాజంలో అసమానతలను తన రచనలతో గుర్రం జాషువా ఎండగట్టారని తెలిపారు. దార యేసురత్నం, తాళ్లూరి రాజేంద్రప్రసాద్, ఎంపిడి.కృపావరం,. మోత నాగలక్ష్మి, ఉసురుమూర్తి రామారావు, చాపల రాజు, వెంట్రుపట్టి వీర్రాజు, పలివెల రాజు, అనపర్తి సురేంద్రబాబు, దొండపాటి కృష్ణఫర్, బుజ్జి కామరాజు, సత్యానందం పాల్గొన్నారు.

తాళ్లపూడి రాగోలపల్లి ఎంపిపి పాఠశాల హెచ్‌ఎం దున్నా దుర్గారావు గుర్రం జాషువా, కాటన్ దొర వర్థంతి సందర్భంగా పాఠశాల ఆవరణలో వారి చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడారు. జలాలను వినియోగంలోకి తెచ్చేలా ఆనకట్టలను, కాలువలను నిర్మించిన కాటన్ దొర సేవలు చిరస్మరణీయమన్నారు.

నేరాలు ఘోరాలు

రిజర్వాయర్లో జాలరి గల్లంతు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేరు రిజర్వాయర్లో చేపలు వేటకు వెళ్లి జాలరి గల్లంతైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ మేరకు తహశీల్దార్ వై.రంగారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మర్రి వీడు గ్రామానికి చెందిన ముంగర కాళహస్తి (53) అనే జాలారి పడవను ఒడ్డుకు తోసుకొస్తుండగా ఈదురు గాలులకు పడవను తోయలేక మునిగి పోయాడు. గ్రామానికి చెందిన పంతుల చిన్ని ఇచ్చిన సమాచారంతో పదిమంది గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కాళహస్తి భార్య ముంగర లక్ష్మి ఏలేశ్వరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.

గాయపడిన వ్యక్తి మరణం

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక కల్పన సెంటర్లో ఈ నెల 20న జరిగిన కారు ప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. ఈ ప్రమాదంలో పీత సతీష్, లక్ష్మణ్‌కుమార్ అక్కడకు అక్కడే మృతి చెందిన విషయం విధితమే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ జక్కం దుర్గాప్రసాద్(32) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - కడియం

చోరీ కేసుల్లో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. యం రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానస్పదంగా తిరుగుతున్న రాజమహేంద్రవరం నారాయణ పురానికి చెందిన వడ్డాది దుర్గా ప్రసాద్, మరో ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకుని ఎస్ఐ బి.నాగ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యాన విచారించారు.కడియంలో ఒక సెల్ ఫోన్ షాపులో చోరీ, ఒక ఆటో దొంగతనం, బూరుగు పూడిలో ఒక ఆటో దొంగతనం, పెరవలిలో ఒక బైకును అపహరించినట్టు నిందితులు అంగీకరించారు. వీరి వద్ద నుంచి రెండు ఆటోలు, ఒక బైకు స్వాధీనపరచుకున్నట్టు సిఐ బి.తులసీధర్ తెలిపారు. దుర్గాప్రసాద్‌ను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించగా, ఇద్దరు బాలురను జువెనైల్ హోమ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుల మందు తాగిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మతి చెందాడు. ముమ్మిడివరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలో బూరుగులంక గ్రామానికి చెందిన చింతలపూడి లోవరాజు (30) కుటుంబ కలహాలు నేపథ్యంలో ఈ నెల 12న పురుగులు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. దీనితో కుటుంబ సభ్యులు హుటాహుటిన అతన్ని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతున్న లోవరాజు బుధవారం మతి చెందాడు. లోవరాజుకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు ముమ్మిడవరం ఎస్ఐ డి.సురేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మునిపల్లి పంచాయతీ కోటుగట్టులో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. తిరుకోటి సురేష్ కు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధం కావడంతో స్థానికులు మంటలను ఆర్పి వేశారు. ఆస్తి నష్టం సుమారు రూ.లక్ష ఉంటుందని అంచనా. ఈ ప్రమాదంలో సురేష్ కుటుంబం నిరాశ్రయులయ్యారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, తహశీల్దార్ టి. మల్లికార్జునరావు, ఎంపిడిఒ కెవి.ప్రసాద్, విఆర్ఒ,జి.వీరవేణి పరామర్శించారు. ప్రభుత్వం పరంగా అన్ని విధాల ఆదుకుంటామన్నారు.

బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- ముమ్మిడివరం

జాతీయ రహదారిపై బుధవారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్ర గాయాలు పాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బైపాస్ రోడ్ కొండాలమ్మ చింత ప్రాంతంలో యానాం నుంచి అమలాపురం వైపు బైక్ పై ఇద్దరు యువకులు వెళుతున్నారు. వీరు అమలాపురం నుంచి యానాం వైపు వెళుతున్న బైక్‌ను ఢీ కొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. యానాం నుంచి బైక్‌పై వస్తున్న ఇద్దరు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు వాసులుగా పోలీసులు గుర్తించారు. యువకులు మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గాయపడిన ముగ్గురిని హైవే పోలీసులు అమలాపురం లోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

26న రెండు గ్రామాల్లో వైద్యశిబిరాలు

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖ సౌజన్యంతో ఈనెల 26న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంబాజీపేట మండలం తొండవరం గ్రామపంచాయతీ ఆవరణలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తారని రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి జిల్లా లీగల్ సర్వీసెస్ అధారిటీ అధ్యక్షులు వి.నరేష్ బుధవారం తెలిపారు. 26వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు వాకల గురువు గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో మెడికల్ క్యాంప్ నిర్వహిస్తారన్నారు. ప్రజలు ఈ మెడికల్ క్యాంపులు సద్వినియోగపరుచుకోవాలన్నారు.

నేడు దంత వైద్యశిబిరం

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరులో గురువారం లెనోరా డెంటల్ ఆస్పత్రి రాజానగరం వారిచే ఉచిత పంటి పరీక్షలు నిర్వహిస్తారని బుధవారం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కాకతీయ కమ్మ కిచెన్ సెంటర్ వల్లూరులో పాతూరి మాధవరావు మిల్లు వద్ద దంత వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కాకతీయ కమ్మ కిచెన్ నిర్వాహకులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

పెద్దాపురంలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ రామకృష్ణ

ప్రజాశక్తి - పెద్దాపురం, ఏలేశ్వరం, జగ్గంపేట

ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని పెద్దాపురం మండలం మరలావ సర్పంచ్ తోట రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం పరిసరాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం, పరి శుభ్రత ద్వారానే గ్రామీణ ప్రాంతాలు ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. గ్రామాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యాళ్ల రామకృష్ణ, కాతా రాంబాబు, బొదిరెడ్డి చంటియ్య, సత్యం, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఏలేశ్వరం పట్టణంలోని పలు పాఠశాలల్లో టిడిపి నాయకు డు బొదిరెడ్డి గోపి మొక్కలు నాటారు. స్వచ్ఛమైన ఆక్సిజన్ అందాలంటే చెట్లు పెంచడం తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు మూది నారాయణ స్వామి, పెంద్ర శ్రీను ఎండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, మున్సిపల్ కమి షనర్ కె.శివప్రసాద్, మేనేజర్ కె.శ్రీనివాసరావు, ఎంఇఒ లక్ష్మి, పాల్గొన్నారు. అలాగే జగ్గంపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి వైద్యులు టి.ప్రణీత్ ఆధ్వర్యంలో స్వచ్ఛత వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సంద ర్భంగా డాక్టర్ ప్రణీత్ మాట్లాడుతూ పరిసరా లను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. వైద్యులు మాధురి, సంధ్య, వినుష, భాగ్యలక్ష్మి, తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిడిఒ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

వరద నీటిలో నడుచుకుంటూ వస్తున్న విద్యార్థులు

ఎంపిడిఒ మృతిపై సిఐడి విచారణ చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట

నరసాపురం ఎంపిడిఒ వెంకట రమణా రావు ఆత్మహత్యకు గల కారణాలపై సిఐడి విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వెంకటరమణారావు ఆకస్మిక మృతికి నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి సంతాపం వ్యక్తం చేశారు. రమణారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంపిడిఒ శ్యాంసుందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఎంపిడిఒ వెంకట రమణారావు ఆత్మహత్యా సంఘటన ఉద్యోగులు మనోధైర్యాన్ని కోల్పోయేలా ఉంద న్నారు. బోటు కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.54 లక్షలను చెల్లించకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఎంపిడిఒ వారి ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకునేలా చేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై సిఐడి విచారణ నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఎఒ మంగతాయారు, పంచాయతీ కార్యదర్శులు, డ్వామా, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి న్యాయం

ప్రజాశక్తి - పిఠాపురం

గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి న్యాయం జరిగిందని పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎపిలో కూటమి ప్రభుత్వం కేంద్రంతో మంచి అనుబంధం కలిగి ఉండడం శుభపరిణామం అన్నారు. మూడు రాజధానుల పేరుతో గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిందని, నేడు రాష్ట్రానికి శాశ్వత రాజధాని అవసరమని కేంద్ర ప్రభుత్వం అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయించడం సంతోషకరమన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు ఎస్ సురేష్, పిల్లా శివశంకర్, డి.చిన్నబాబు, సిహెచ్.సతీష్, పాల్గొన్నారు.

గర్భిణులు, వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం గ్రూప్ మాతృత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో 130 మంది గర్భిణులు, 80 మంది వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రూపు అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ శ్రీ సేవ ఆర్గనైజేషన్ గ్రూప్ సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీ సేవ గ్రూప్ అడ్మిన్స్ కోసూరి సత్యప్రసాద్, మనోజ్ కుమార్ జైన్ పాల్గొన్నారు.

కొత్తలంకను చుట్టిన వరద

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో పిల్లంక, గోవలంక, కొత్తలంక వరద తాకింది. కొత్తలంకలో కాయ గూరలు, ఉద్యానవన పంటలు నీట మునిగాయి. లంక గ్రామాల్లోని పశువులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. గ్రామంలోకి వరద నీరు మరింతగా చేరే అవకాశం ఉండటంతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. పునరావస కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే గోవలంక, పిళ్లంక ప్రాంతాల్లో ఏటిగట్టు బలహీనంగా ఉండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాలల వికాశ గ్రామాలు స్థాపించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

బాలల వికాశ గ్రామాలను స్థాపించాలని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ జె.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రలో జరుగుతున్న 11 జిల్లాలకు చెందిన జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనీల రెండవ బ్యాచ్ శిక్షణ బుధవారం ముగిసింది. ఆరోగ్యం, విద్య రంగాలను, సుస్థిరాభివద్ధి సాధనలోని బాలల వికాస గ్రామం కొరకు ఎలా వినియోగించుకోవాలో శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ట్రైనీలకు సర్టిఫికెట్లను అందచేశారు. ఈ శిక్షణలో వైస్ ప్రిన్సిపల్ కృష్ణమోహన్, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ శ్రీదేవి, ఫ్యాకల్టీ సభ్యులు శ్రీనివాసరావు, నీహారిక, ప్రసాద్, వెంకటేశ్వర్లు, పద్మజ, ఆంజనేయులు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. పాల్గొని శిక్షణ నిచ్చారు.

రోగులకు తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - కోటనందూరు

రోగుల రూమ్‌లో స్లాబు నుంచి పడిన పెచ్చులలు

తుని ఏరియా ఆసుపత్రిలో బుధవారం రోగులకు పెను ప్రమాదము తప్పింది. రోగులతో నిండి ఉన్న గదిలో స్లాబు పైకప్పు నుంచి ఒక్కసారిగా పెద్ద పెచ్చులు విరిగిపడడంతో రోగులు తీవ్ర భయాందోళనకు గురయ్య పరుగులు తీశారు. స్లాబు పైనుంచి పెచ్చులు రోగులపై కాకుండా బెడ్స్ పక్కన పడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. దీంతో ఆ రూములో రోగులను మరో రూమ్‌కు తరలించారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - సామర్లకోట

విద్యార్థులు శారీరక దృఢత్వంతోపాటు, మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని ఎంఇఒ-2 పి.పుల్లయ్య అన్నారు. బుధవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం స్థానిక పిఎం మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ డేను ఆయన సందర్శించారు. విద్యార్థులకు కబడి, మ్యూజికల్ చైర్స్, తొక్కిడి బిళ్ళ, లెమన్ అండ్ స్పూన్, లగోరి వంటి క్రీడలను నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థి కె.యశ్వంత్‌కుమార్ ప్రదర్శించిన యోగాసనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభాపాటవాలను ఎంఇఒ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రాంథాలయ పితామహుడు 'అయ్యంకి'

కాకినాడలో అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - కాకినాడ, పెద్దాపురం

గ్రంథాలయ ఉద్యమంలో విశేష కృషి చేసిన అయ్యంకి వెంకట రమణయ్య గ్రంథాలయ పితామహుడుగా గుర్తింపు పొందారని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి విఎల్ఎన్ఎస్‌వి.ప్రసాద్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథా లయంలో రమణయ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యంకి వెంకట రమణయ్య పత్రికా సంపాదకులుగా, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యం లో సిద్ధహస్తులని, ఆయన గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం విశేష కృషి చేసి, గ్రంథాలయ పితామహుడుగా పేరుగాంచా రన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎల్.వెంకటేశ్వరరావు, రికార్డు అసిస్టెంట్ ఎస్.రాజు, టి. వీర్రాజు, అవుట్ సోర్స్ లైబ్రేరియన్ నాగేంద్రకుమార్, వి.అరుణ, కార్యాల య రికార్డు అసిస్టెంట్ టి సాయి వెంకట్రావు పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు పాల్గొన్నారు.

రహదారిపై గోతులు పూడ్చిన యువకులు

ప్రజాశక్తి -మామిడికుదురురూరల్

పెదపట్నం లో ప్రధాన రహదారి గోతులయంగా మారింది. స్థానిక యువకులు చొరవ చూపి శ్రీ కనకదుర్గమ్మ ఆలయ పరిసరాల్లో ఉన్న గోతులపై గ్రావెల్ వేసి బుధవారం పూడ్చారు. గ్రావెల్, కంకర సేకరించి వాటిని తోపుడు బండిపై ఎగుమతి చేసి ద్విచక్ర వాహ నంపై తీసుకువచ్చి గోతులలో వేసి చదును చేశారు. పెదపట్నం ప్రధాన రహదారి కి నిధులు మంజూరయ్యాని బిల్స్ వచ్చిన వెంటనే పనులు చేపడతామని ఆర్అండ్‌బి ఎఇ సురేశ్ అన్నారు.

ఎంఆర్‌పిఎస్ జిల్లా సమావేశం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఇమ్మిడివరప్పాడులో బుధవారం ఎమ్ఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు సవరపు భైరవ మూర్తి అధ్యక్షతన జిల్లా సమావేశం నిర్వహించారు. ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ సత్తిబాబు మాదిగ, అధికార ప్రతినిధి నూటికుర్తి సత్యనారాయణ మాట్లాడారు. కమిటీల ఏర్పాటులకు నాయకులు కృషి చేయాలన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని కాపవరంలో జనసైనికుడు పువ్వల సదాశివ గోపి తన కుమార్తె జాబిలమ్మ పుట్టిన రోజు వర్షాలకు ముంపునకు గురైన నిడదవోలు మండలం రావిమెట్ల, తిమ్మరాజుపాలెంలో వరద బాధితులకు నగదు, నిత్యావసర సరుకులు బుధవారం పంపిణీ చేశారు. ఇటీవల మృతి చెందిన ఒకరి కుటుంబానికి మట్టిఖర్చులకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగా రమేష్, సాద వెంకటేష్, కార్మూరి శేషుబాబు, కోలా సీతయ్య, రంకిరెడ్డి ప్రసాద్, ఇంటి వెంకట్, బసవా గణపతి, పంపన నాగప్రసాద్, కండెల్లి ప్రశాంత్, దాసం నాగరాజు, దాసం దొరబాబు, పెద్దింశెట్టి భాస్కరరావు, చింతలపూడి ప్రసాద్, అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

జాతీయ విద్యా విధానం నాలుగో వార్షికోత్సవ సందర్భంగా ఈనెల 22 నుంచి 28 వరకు అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎ.మధుసూదన రావు పేర్కొన్నారు. గొల్లవిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో బుధవారం నిర్వహించిన క్రీడా దినోత్సవంలో మధుసూదనరావు పాల్గొని క్రీడలను తిలకించారు. అనంతరం మాట్లాడుతూ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టిన తర్వాత పరివర్తనాత్మక సంస్కరణలపై దేశవ్యాప్తంగా విద్యాభివద్ధి చేయడంలో నిబద్ధతను తెలియజేసేదే ఈ కార్యక్రమమని అన్నారు. ఇందులో విద్యార్థులు ఉపాధ్యాయులు స్థానికులను భాగస్వామ్యం కావాలని కోరారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి సత్తి సత్య కృష్ణ, హెచ్ఎం,లంక రాణి, ఉపాధ్యాయులు ఉన్నారు. **ఆత్రేయపురం:** మండలంలోని మెర్లపాలెం నెంబర్ వన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం శిక్షా సప్తాహ కార్య క్రమం క్రీడా పోటీలలో భాగంగా సాంప్రదాయ ఆటల పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతా శ్యామ్ కుమార్ అధ్యక్షతన మెర్ల పాలెం ఉప సర్పంచ్ గోప లక్ష్మి ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఉప సర్పంచ్ లక్ష్మి మాట్లాడుతూ చిన్నారులలో సజనాత్మక పెంచుటకు శిక్ష సప్తహ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మల్లవరపు నాగరాజు, పసుపులేటి లోవరాజు, మట్ట శ్రీను, ఎర్రసాని బుచ్చియ్య, మిద్దె మల్లేశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిప్మెర్‌లో 209 పోస్టుల భర్తీకి చర్యలు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి జిప్మెర్ వైద్యవిజ్ఞాన సంస్థలో 209 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు సంబంధిత సంస్థ డైరెక్టర్ బుధవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఇందులో 154 గ్రూప్ బీ -నర్సింగ్ ఆఫీసర్లు, 24 జూనియర్ అసిస్టెంట్లతోపాటు, ఇతర పోస్టులకోసం దేశవ్యాప్తంగా అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. www.jipmer.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించి ఆగస్టు 19వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పరీక్ష హాల్‌టిక్కెట్లను సెప్టెంబర్ 2 నుంచి పొందవచ్చన్నారు. జిప్మెర్ బోర్డు డైరెక్టర్ల నిర్ణయం ప్రకారం 80 శాతం నర్సింగ్ ఆఫీసరు పోస్టులను మహిళలకు కేటాయించనున్నట్లు తెలిపారు.

గోపాలపురంలో చెత్తకుప్పల తొలగింపు

ప్రజాశక్తి-గోపాలపురం

వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు రాకుండా అధ్వానం ఉన్న చెత్తకుప్పలు తొలగిస్తున్నట్లు సర్పంచ్ పైడి శిరీష, పంచాయతీ కార్యదర్శి ఎస్.చినవెంకాయమ్మ తెలిపారు. బుధవారం స్థానిక గోపాలపురంలో ఉప్పరగూడెం గ్రామంలో అద్వానంగా ఉన్న చెత్త కుప్పలను యంత్రాల ద్వారా తొలగించి తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు బారిన పడకుండా గోపాలపురం గ్రామంలో చెత్తకప్పలను తొలగించినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాల పరిశుభ్రం ఉంచుకోవాలని తెలిపారు. దోమలను అరికట్టేందుకు గ్రామాలలో ఫాగింగ్ చేసునట్లు వారు తెలిపారు.

సప్లయ్ కంపెనీ సభ్యుల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-తాళ్లపూడి

సౌండ్ లైటింగ్, సప్లయ్ కంపెనీల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం తాళ్లపూడిలోని సొలస సత్యనారాయణ దమయంతి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. నూతన పాలకవర్గం సంఘ అభివద్ధితోపాటు సభ్యుల సంక్షేమానికి కృషి చేయాలని పలువురు మండల స్థాయి అధికారులు అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన తాళ్లపూడి తహశీల్దారు ఎం.శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ అధికారి సిహెచ్.వెంకట్రావు మాట్లాడారు. కొవ్వూరు, రాజమండ్రి పట్టణాలకు చెందిన సౌండ్ లైటింగ్ సప్లయ్ కంపెనీల యజమానులు మాట్లాడుతూ తమ కంపెనీలను స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్‌గా ప్రభుత్వం గుర్తించాలని కోరారు. కార్యవర్గం నూతన గౌరవాధ్యక్షునిగా ఎలుబోలు రాజు, అధ్యక్షునిగా కొండే వెంకటరమణ, ఉపాధ్యక్షునిగా డివి, కార్యదర్శిగా వీరబ్రహ్మం, సహాయ కార్యదర్శిగా సిహెచ్.రామకృష్ణ, కోశాధికారిగా పెంటా శ్రీను పాల్గొన్నారు.

ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ల నియామకం

సమీక్షిస్తున్న కమిషనర్ రామారావు ప్రత్యేక అధికారి రాధాకృష్ణ

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో పారిశుధ్య విభాగ పర్యవేక్షణకు అవసరమైన ఇద్దరు సానిటరీ ఇన్‌స్పెక్టర్లను కొత్తగా నియమించినట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, ప్రత్యేకాధికారి రాధాకృష్ణ వెల్లడించారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో శానిటరీ మేస్త్రీలతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భ:గా వారు మాట్లాడుతూ కలెక్టర్ పర్యటనలో పట్టణంలో పారిశుధ్య విభాగం అధ్వానంగా గుర్తించడంతో తోణమే ఇన్‌ఛార్జ్ సానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను తొలగించి కొత్తగా ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను నియమించాలని ఆదేశించారని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో ఒకటో సచివాలయం నుంచి 8వ సచివాలయం వరకూ సాయిచరణ్‌ను, 9 నుంచి 15 సచివాలయాల వరకూ రవికృష్ణలను సానిటరీ ఇన్‌స్పెక్టర్లగా నియమించినట్లు చెప్పారు. పట్టణంలో శానిటేషన్ మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ఇంటింటికి తిరిగి చెత్త కుప్పలు రోడ్లపై వేయకుండా గృహస్థులకు అవగాహన కల్పించాలని, అప్పటికి వినకపోతే నోటీసులు ఇచ్చి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే పలు వ్యాపార సంస్థలు, హోటల్స్ వద్ద చెత్త వేసే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో పారిశుధ్యం మరింత మెరుగుపరిచేలా చూస్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో సచివాలయాల శానిటరీ సెక్రటరీలు, సానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ఆర్థర్ కాటన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం, తాళ్లరేవు

సర్ ఆర్థర్ కాటన్‌కు యానాం అధికారులు ఘనంగా నివాళులర్పించారు బుధవారం స్థానిక ఫెర్రీ రోడ్డు మార్గంలో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యూడి ఇఇ చంద్రశేఖరన్, ఎస్‌పి రాజశేఖరన్, సిఐ షణ్ముగం, ఎస్ఐలు మురుగానందం, శేరు నూకరాజు, కొల్లు ప్రసాద్ పాల్గొన్నారు. తాళ్లరేవు మండలంలోని పి.మల్లవరం శివారు పత్తిగొంది గ్రామంలో కాటన్ వర్ధంతిని నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, ఎన్ఆర్ఐ సలాది సత్యకృష్ణ కాటన్ విగ్రహానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ సత్యనారాయణ, దూలిపుడి వీరభద్రరావు, దూలిపూడి రాము పాల్గొన్నారు.

ఎపి అభివృద్ధికి కేంద్రం అండ

ప్రజాశక్తి - పిఠాపురం

కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి అండగా నిలుస్తుందని నేటి కేటాయింపులే ఉదాహరణ అని మాజీ ఎంఎల్ఎ వర్మ అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి అత్యధిక నిధులు కేటాయించిందంటే దానికి కారణం సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ అని అన్నారు. గత ప్రభుత్వ పాలకులు రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టును భ్రష్టు పట్టించారని విమర్శించారు. రాష్ట్రానికి రానున్న రోజుల్లో మంచి రోజులు రానున్నాయని ఆయన అభిప్రాయపడారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు సత్యానంద రెడ్డి, పి.చిన్నా, ఎన్.శ్రీను, బి.సత్యనారాయణ, ఎన్.ప్రకాష్, కె.కృష్ణ, పి.బాల పాల్గొన్నారు.

'రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి'

ప్రజాశక్తి - సామర్లకోట

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చేలా పంటస్థితిని బట్టి ఎప్పటికప్పుడు రైతులకు విఎఎలు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్‌కుమార్ పిలుపు నిచ్చారు. బుధవారం సామర్లకోట వ్యవసాయ విత్తన ఉత్పత్తి సంస్థ వ్యవసాయ ఫారంలో స్వచ్ఛత వారోత్సవం, విఎఎలు, ఎఒలు, ఎడిఎల శిక్షణా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పరిస్థితిని బట్టి దిగుబడికి రైతులకు ఇవ్వవలసిన సూచనలు విఎఎలకు వివరించారు. ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వారికి వివరించాలని సూచించారు. ఎడిఎ ఎం.రత్నప్రసాంతి మాట్లాడుతూ సిసిఆర్‌సి కార్డుల యొక్క ఆవశ్యకత, లక్ష్యాలు త్వరితగతిన పూర్తి చేసి బ్యాంకుల ద్వారా కౌలు రైతులకు రుణాలు ఇప్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక భూసార పరీక్ష కేంద్రం ఎడిఎ భాస్కర రావు, మండల వ్యవసాయ అధికారి ఐ.సత్య, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

My Old Name is **SINGARAJU SATYA SIVA SUBRAHMANYA SRINIVAS.** My changed name is **SINGARAJU SRINIVAS.** Since today onwards. Iam calling with my new name & changed name as **SINGARAJU SRINIVAS.**

SINGARAJU SRINIVAS
D.No. 75-1-5/10, Classic Heights, Prakash Nagar, Rajamahendravaram, East Godavari District, Andhra Pradesh State, Cell: 9885248643

పాస్‌పోర్టు పోయినది

యెరుబండి శ్రీ శశిచంద్ర, S/o. రామకృష్ణారావు, డోర్ నెం. 12-11-165/2, ఆర్యాపురం, రాజమండ్రి వాస్తవ్యులు తెలియజేయునది ఏమనగా, నా కుమారుడైన శ్రీ సాత్విక్ రుధ్వకృష్ణ కెనడాలో జన్మించినాడు. అతనికి **AL381372** నెంబరు గల పాస్‌పోర్టు ఇచ్చినారు. సదరు పాస్‌పోర్టుతో నేను, నా ఫ్యామిలీ **18-7-2023**న తిరుపతి వెళ్లి వచ్చి ఇంటిలో పెట్టగా దానిని నేను ఈ మధ్య కెనడా నుండి వచ్చి ఇంటిలో గత వారం రోజులుగా వెతకగా వెతకగా సదరు పాస్‌పోర్టు కనిపించలేదు. కావున కొత్త పాస్‌పోర్టు కొరకు దరఖాస్తు చేయుటకు పోలీసు వార్కి కంప్లైంట్ ఇవ్వడమైనది. సదరు పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినచో నా ఫోన్ నెంబరుకు ఫోన్ చేసి ఇవ్వవలసినదిగా కోరుచున్నాము. మరియు దీనిపై ఎవరికైనా ఆక్షేపణలున్నా తెలియచేయవలెను.
రాజమండ్రి, తేది:24-07-2024

యెరుబండి శ్రీ శశిచంద్ర
రాజమండ్రి, సెల్: 9848858409

ప్రకటన


కీ॥శే॥లు శ్రీమతి **తిరుకోటి వెంకమ్మ** W/o. నర్సన్న

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అల్లవరం మండలం, తుమ్మలపల్లి గ్రామ కాపురస్తులు పరమట ఆంజనేయులు, S/o. వీరరాఘవులు గారు వ్రాయించి ఇచ్చిన ప్రకటన.

మా అమ్మమ్మ **శ్రీమతి తిరుకోటి వెంకమ్మ,** W/o. నర్సన్న గారు ది. 25-02-1999న తుమ్మలపల్లి గ్రామం నందు గల సొంత ఇంటి వద్ద మరణించారు. వీరి మరణం గ్రామపంచాయతీలో నమోదు కాలేదు. ఎవరికైనా ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు

ఇట్లు: పరమట ఆంజనేయులు
S/o. వీరరాఘవులు, ఇంటి నెంబర్: 13-29, మర్రిచెరువు, తుమ్మలపల్లి, అల్లవరం మండలం, సెల్: 7330869922

మహారాజశ్రీ 1వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 22/2023

Between:
UCO Bank, Rep. by its Branch Manager, Rajamahendravaram Branch, Rajamahendravaram.
...Plaintiff
AND
1) Gummala Gouthama Buddudu and Others
...Defendants

D-1: Gummala Gouthama Buddudu, S/o. Paparao, Hindu, aged 53 years, Agriculturist, R/o. D.No. 2-88, Rangampeta, Rangampeta Mandalam, E.G.Dt., 533291.
...1st Defendant

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 12-8-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

డి.వి.కె.రమేష్
రాజమండ్రి **డి.వాణి రమేష్**
24-7-2024 అడ్వకేట్స్, రాజమండ్రి

మహారాజశ్రీ 6వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 43/2023

Between:
UCO Bank, Rep. by its Branch Manager, Rajamahendravaram Branch, Rajamahendravaram.
...Plaintiff
AND
1) Echapurapu Ramakrishna and Others
...Defendants

D-2: Yalamarthi Ramarao, S/o. Maamayya, Hindu, aged 42 years, Land-Lord, R/o. D.No. 2-75/2, Gaja Sthambam Street, Inugantivari Peta, Seethanagaram Mandal, E.G.Dist., 533287. *...2nd Defendant*

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 10-9-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

డి.వి.కె.రమేష్
రాజమండ్రి **డి.వాణి రమేష్**
24-7-2024 అడ్వకేట్స్, రాజమండ్రి

మహారాజశ్రీ పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A. 892/2022 in O.S. 25/17

Between:
మోకర్ల శేష్‌కుమార్ **-పిటీషనర్/వాది**
మరియు
గండేడ @ గంటేడ అన్నపూర్ణ & 4 ఇతరులు
-రెస్పాండెంట్లు/ ప్రతివాద్లు

To:
గంటేడ జోయ్‌సీ మేరి, D/o. లేటు బాబుప్రసాద్, 31 సం॥లు, భూ కామందు, డో.నెం. 3-10-1/3, శాంతినగర్, తుని, తుని మండలం
(ప్రపోజ్డ్ పార్టీ)
-5వ రెస్పాండెంటు/ 5వ ప్రతివాది

పై నెంబరు దావాలో పిటిషన్ ద్వారా మిమ్ములను దావాలో చేర్చు నిమిత్తంగా మీకు పిటీషనర్ గారు ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు అందుకోకుండా తిప్పి వేయుచున్నందున శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ప్రకారంగా ఈ ప్రకటన పూర్వకముగా తెలియజేయునది ఏమనగా, మీరు **ది. 01-08-2024వ తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని, న్యాయవాది కృతముగా గాని హాజరు కావలయును. అట్లు హాజరు కాని యెడల దావాను మీ పరోక్షమున తీర్మానించెదరని తెలియజేయడమైనది.

సయ్యద్ మెహబూబ్ అలి
న్యాయవాది, పిఠాపురం